## క్లుప్తంగా

### ఈడబ్ల్యూఎస్‌తో నష్టపోతున్న ఓబీసీలు



పెదకాకాని: అగ్రవర్ణ పేదలకు ఇస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వలన ఓబీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. పెదకాకాని సెంటర్‌లోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేసన మట్లాడుతూ అతి తక్కువ మార్కులతో విద్యాలయాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల ద్వారా సీట్లు, ఉద్యోగాలను పొందడం వలన అణగారిన రిజర్వేషన్ వర్గాలు, ముఖ్యంగా ఓబీసీలు తీవ్రంగా ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 15 శాతం గా ఉన్న ఆధిపత్య కులాల వారిలో పేదలు మూడు శాతానికి మించి ఉండరని, వారికి 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చి, ఈ రోజు ఏమాత్రం ప్రతిభ చూపని, తక్కువ మార్కులు వచ్చిన వారికి విద్యా ఉద్యోగాలలో అవకాశాలు కల్పించడం ప్రతిభకు తూట్లు పొడవటం కాదా?!..అంటూ ప్రభుత్వాన్ని కేసన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే జీఓ 29 రద్దు చేసి, పాత జీఓ 55 అమలు చేయాలన్నారు.

### 26న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ర్యాలీ

చేబ్రోలు: కేంద్ర ప్రభుత్వ విధానాల వలన కార్మికులు ఆధునిక బానిసలుగా మారుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీ నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న గుంటూరులో నిర్వహించనున్న ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. చేబ్రోలు స్పిన్నింగ్ క్లస్టర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే నాలుగు లేబర్ కోడ్సును రద్దు చేయాలని కోరారు. పరిశ్రమలలో వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక పెన్షన్స్ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే ప్రదర్శన బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.హనుమంత రావు, మంజుల, రాఘవమ్మ పాల్గొన్నారు.

### గొడవర్రులో మరుగుదొడ్డి ఆవశ్యకతపై అవగాహన



చేబ్రోలు: మండలంలోని గొడవర్రు గ్రామంలో మన టాయిలెట్ - మన గౌరవం అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత, మన గౌరవం, మన ఆరోగ్యంలో భాగంగా మరుగుదొడ్డి నిర్వహణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ 10 వరకు టాయిలెట్ సెలబ్రేషన్- 2024 కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గొడవర్రు గ్రామ సర్పంచి బీరం జానకి దేవి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం, ప్రజలు మరుగుదొడ్డి ఆవశ్యకత, వినియోగం గురించి మరింత అవగాహన పెంచుకోవాలని కోరారు. మరుగుదొడ్డి నిర్మాణం చేసుకొనేవారు గ్రామపంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మానవహారం, అవగాహన కార్యక్రంలో పంచాయతీ కార్యదర్శి బి.సుబ్బారావు, మండల కోఆర్డినేటర్ జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

### డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: డిసెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో జరిగే లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడే క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

# విత్తన శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

**లాంఫాం శాస్త్రవేత్త వెంకటలక్ష్మి**



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: మండలం జొన్నలగడ్డలో లాంఫాం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. స్థానిక రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం రబీ కాలంలో రైతు శనగ పంట విత్తటం జరుగుతుందని, విత్తనం ద్వారా సక్రమించే తెగుళ్లు, పురుగుల నివారణకు ట్రైకోడెర్మ విరిడి 08 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 03 గ్రాములు, సాఫ్ 03 గ్రాములను కేజీ విత్తనానికి కలిపి ప్రతి రైతు తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు. విత్తిన 24 గంటలలోపు పెండిమెథాలిన్ 01 లీటరు మందును ఒక ఎకరానికి పిచికారి చేయటం వల్ల మొదటి 20 రోజులు కలుపును నివారించుకోవచ్చన్నారు. 20 రోజుల తరువాత లేదా కలుపు రెండు లేదా మూడు ఆకుల దశలో ఉన్నప్పుడు పర్స్యూట్ 200 గ్రాములు మందును ఒక ఎకరానికి పిచికారి చేయటం వలన పంటలో కలుపు ఉధృతి తగ్గించుకోవచ్చని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ శనగలో ఎన్‌బీఈజీ 452 నూతన రకం, జేజీ 11 రకం లాగే ఉన్నాయని, అయితే జేజీ 11 రకం కంటే ఎండు తెగులును అధికంగా తట్టుకుంటుందని వివరించా. ఎన్‌బీఈజీ 776 రకం వరి తరువాత మాగాణి భూమిలో అనువైన రకమని, యంత్రాల ద్వారా కోత కొయ్యటానికి వీలుగా ఎత్తు పెరిగే అనువైన రకమని చెప్పారు. అనంతరం శాస్త్రవేత్తలు, రైతులు పత్తి, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వంగా నవీన్‌రెడ్డి, నామా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అనుమతి లేని పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు



పురుగు మందులను పరిశీలిస్తున్న పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి

కాకుమాను: నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా పురుగు మందులు విక్రయిస్తే అటువంటి దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి హెచ్చరించారు. పెదనందిపాడు మండలంలోని పలు గ్రామాలలో పురుగు మందుల దుకాణాలను శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ దుకాణాలలో అనుమతి పొందిన పురుగు మందులను మాత్రమే విక్రయించాలని నిబంధనలకు విరుద్ధంగా పురుగు మందులు విక్రయిస్తే అటువంటి దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకి తప్పని సరిగా రసీదు ఇవ్వాలన్నారు. ప్రతి దుకాణంలో ప్రతి రోజు స్టాకు వివరాలు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసందర్భంగా అనుమతి పత్రాలు లేకుండా విక్రయిస్తున్న సుమారు లక్ష రూపాయల విలువ కలిగిన పురుగుల మందులను గుర్తించి అమ్మకాలను నిలిపివేశారు. ఆమె వెంట ఏఓ బి.సుధారాణి ఉన్నారు.

## 26న కార్మికుల ఆందోళన జయప్రదం చేయాలి

పెదకాకాని: ఈనెల 26వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గుంటూరులో నిర్వహించనున్న ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్ కోరారు. పెదకాకాని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అరుణ్ కుమార్ మాట్లాడారు. గుంటూరు శంకర్ విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు కార్మిక, రైతు, ప్రజా సంఘాల ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశానికి సంఘం జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం నవంబర్ 26 దేశ వ్యాప్త నిరసన కార్యక్రమ సంబంధిత వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పొన్నూరు ఏరియా నాయకులు బొట్టు శ్రీనివాసు, రామిశెట్టి శ్రీనివాసరావు, వెంకట్రావు, రాజు పాల్గొన్నారు.

## చిప్స్‌లో ముగిసిన జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో జాతీయ స్థాయి ఫార్మసీ వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులకు వారోత్సవాల్లో భాగంగా వివిధ రకాల పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. అదే విధంగా కళాశాల పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సమీప గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీలను చేపట్టటం జరిగిందన్నారు. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ డి.లక్ష్మణ్, ఏపీటీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటరమణ, ఏపీజీపీ స్టేట్ బ్రాంచ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పి. శ్రీనివాస్ బాబు, ఐపీఏ స్టేట్ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రసాదరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

## మలినేనిలో ముగిసిన సదస్సు



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న మైక్రో చిప్ ఎంబెడెడ్ డెవలప్మెంట్ ఫ్యాకల్టీ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఎఫ్కెట్రానిక్స్ సంస్థ సీఈఓ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు నుంచి పరిశ్రమలు ఎక్కువ నైపుణ్యాని కోరుకుంటున్నాయని, సాంకేతిక కళాశాలలో పాతతరహా బోధన పాత విద్యా అంశాలనే బోధిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ వంటి ప్రముఖ ఇంజినీరింగ్ విభాగాల్లో అవకాశాలు తగ్గడంతో అందరూ కంప్యూటర్ సైన్స్ సంబంధించిన విభాగంలో ఎక్కువగా అడ్మిషన్ తీసుకుంటున్నారనీ అది భవిష్యత్‌కు మంచిది కాదన్నారు. కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ విజయసారథి మాట్లాడారు. కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, డీన్ అకాడమిక్స్ జంపని కిషోర్‌బాబు పాల్గొన్నారు.

## విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు తమలోని సృజనకు పదునుపెట్టి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి తెలిపారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, చేతన పాఠశాలలో సైన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఎక్స్‌పోను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోను ప్రారంభించి ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, నూతన ఆవిష్కరణలు చేసి, సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. చిప్స్ ఫార్మసీ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లేశ్వరావు మాట్లాడుతూ ఓటమికి భయపడకుండా, ప్రయత్నంతో విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. రమేష్ హాస్పిటల్ దంత వైద్యులు డాక్టర్ నీలిమ మాట్లాడుతూ విద్యార్థుల ఆవిష్కరణలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయచంద్ మాట్లాడారు. బాలకుటీర్ సీఏఓ దుర్గారఘురామ్, చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎండీ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

## ఆచార్యుల సంఘం కార్యవర్గం ఎన్నిక



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బోధనా సిబ్బంది సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నగర శివారులోని లాం ఫాంలో ఉన్న సమావేశ మందిరంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి సంబంధిత ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (ఏపీఏయూటీఏ) సభ్యులు హాజరయ్యారు. సంఘం నూతన అధ్యక్షులుగా డాక్టర్ వి.శైలజ, జనరల్ సెక్రటరీగా డాక్టర్ ఎన్. సాంబశివరావు, ట్రెజరర్‌గా డాక్టర్ ఎం. శ్రీకాంత్‌తోపాటు వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని విశ్వవిద్యాలయం ఆచార్యులు, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో లాంఫాం అధిపతి డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ డాక్టర్ వై.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధికల్పనే లక్ష్యంగా తమ కళాశాలలో విద్యా బోధన చేస్తున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఎప్లానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. తమ కళాశాలకు చెందిన 6 గురు విద్యార్థులు రూ5.3 లక్షల రూపాయల ప్యాకేజీతో ఉద్యోగాలను పొందారని కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు అధిక ప్యాకేజీతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలిపించేందుకు బహుళ అంతర్జాతీయ కంపెనీలు ముందుకురావడం గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు.

## స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్‌తో నాణ్యమైన చికిత్స



బహుమతులు పొందిన వారితో కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో జాతీయస్థాయి ఈ పోస్టర్ ప్రజంటేషన్ పోటీలను శనివారం నిర్వహించారు. బ్రేకింగ్ జూనియర్స్ నావెల్ అప్రోచెస్ ఇన్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ అనే అంశంపై, స్మార్ట్ డెలివరీ సొల్యూషన్స్ నావిగేటింగ్ ఫిజియోలాజికల్ బారియర్స్ విత్ రెస్పాన్సివ్ సిస్టమ్స్ అనే శీర్షికతో పోటీలను ఏర్పాటు చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగపు ప్రొఫెసర్ పి.పద్మావతి మాట్లాడుతూ ఆధునిక ఆరోగ్య సంరక్షణ రంగంలో వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే ఔషధాలు, టీకాలు జన్యు చికిత్సల్ని లక్ష్య ప్రాంతాలకు చేరవేయడం సవాలుగా మారిన ప్రక్రియ అని తెలిపారు. అయితే స్మార్ట్ డెలివరీ సొల్యూషన్లు ముఖ్యంగా ప్రతిస్పందన శీల వ్యవస్థలు(రెస్పాన్సివ్ సిస్టమ్స్) సమస్యలకు సమగ్ర పరిష్కారాలను అందించాయన్నారు. స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్ అధునాతన సాంకేతికతతో శారీరక వాతావరణం మార్పులకు ప్రతిస్పందిస్తూ లక్ష్య ప్రాంతాలకు ఔషధాలను సరిగ్గా చేరుస్తాయన్నారు. నానో పార్టికల్స్, లిపోసోమ్స్ బయోమిమెటిక్ పదార్థాలు ఔషధ స్థిరత్వాన్ని పెంచి లక్ష్య కణజాలాలను చేరుకోవడంలో సహాయపడతాయన్నారు. హైదరాబాద్ ఏఈటీ ల్యాబ్స్ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్ రోగులకు నాణ్యమైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఔషధాలను అత్యుత్తమంగా రూపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఉపయోగిస్తారని, స్మార్ట్ డెలివరీ సొల్యూషన్లు ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒక విప్లవాత్మక మార్గమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ జాతీయ స్థాయి ఈ పోస్టర్ ప్రజంటేషన్ పోటీలకు 20 కళాశాలలకు చెందిన 244 మంది విద్యార్థులు ఇ పోస్టర్లను ప్రదర్శించారన్నారు. విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ



రంగానగర్ కాలనీలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ కెనడీ

గరికపాడు(కాకుమాను): పాఠశాలలకు సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖాధికారి కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని గరికపాడు పంచాయతీ పరిధిలోని రంగానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించడంతో పాటు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనారాయణ, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పొన్నూరు: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని జై భీమ్ ఆధ్వర్యంలో శనివారం నిడుబ్రోలు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు అంశంపై విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు టి. శ్రీనివాసరావు, వెంకట్రావు పరీక్షను పర్యవేక్షించారు. జై భీమ్ సభ్యులు వేముల నిరీక్షణ, యడ్ల వందనం మాట్లాడుతూ విద్యార్థులలో రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం విద్యార్థులను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నవంబర్, 26న రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సెంటర్‌లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎద్దు శామ్యూల్ రాజ్, గుమ్మడి రోశయ్య, మంద్రు వెంకటరత్నం పాల్గొన్నారు.

## ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

**ఎస్పీ సతీష్‌కుమార్**



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

పట్నంబజారు: ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం నగరంలోని గుజ్జనగుండ్ల, కొరిటెపాడు, లక్ష్మీపురం ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో కలిసి వాహనాల రద్దీ, రాకపోకలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ వాహనాల రద్దీ క్రమబద్దీకరణ, అతివేగ నియంత్రణ, ర్యాష్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్ లను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఇటీవల యువత వాహనాలను గాలిలో నడుపుతూ, ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు, ప్రమాదాలకు కారణమవుతున్నారని, అటువంటి వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆకతాయిలను గుర్తించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం, ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు నగరంలోని ప్రధాన కూడళ్ల, రద్దీ ప్రదేశాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు, విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది బాడీ కెమెరాలను సక్రమంగా వినియోగించాలని సూచించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏవిధంగా వాహనాలు నడుపుతున్నారో పరిశీలించుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యులవుతారని హెచ్చరించారు. ఎస్పీతో పాటు ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య, వెస్ట్ డీఎస్పీ మెహర్ జయరామ్‌ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్, ట్రాఫిక్ సీఐలు సింగయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

**కమిషనర్ పులి శ్రీనివాసులు**



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్ విస్తరణ పనుల జాప్యం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ మెయిన్ ఆఫీస్‌లోని కమిషనర్ చాంబర్‌లో ఏటీ అగ్రహారం రోడ్ విస్తరణలో కోర్టు కేసులు దాఖలు చేసిన వారితో ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ విస్తరణ పనులపై కొందరు కోర్టుకి వెళ్లారని, సోమవారం నుంచి మూడు రోజుల్లో ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్ మాస్టర్ ప్లాన్ సర్వే చేసి బౌండరీలు ఫిక్స్ చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సర్వే సమయంలో కోర్టుకి వెళ్లిన వారికి కూడా ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లు, స్ట్రక్చరల్ నష్ట పరిహారం అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ రోడ్లు,డ్రెయిన్, సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులను వేగంగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

**ఆక్రమణల తొలగింపులో ఎటువంటి రాజీ లేదు**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపుపై రాజీ లేదని, పట్టణ ప్రణాళిక అధికారులు ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కొరిటెపాడు పార్క్ వెనుక డ్రెయిన్, రోడ్ ఆక్రమణలు సోమవారం నుంచి తొలగించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ కొరిటెపాడు, విద్యా నగర్ మెయిన్ రోడ్లలో పర్యటించి, ఆక్రమణల తొలగింపుపై అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కొరిటెపాడు పార్క్ వెనుక రోడ్‌లో సుమారు 60 శాతం, డ్రెయిన్‌ని పూర్తిగా ఆక్రమణ చేసి వ్యాపారాలు నిర్వహించడంపై పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం డ్రెయిన్, రోడ్ మీద ఆక్రమణలను వారే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే సోమవారం ఉదయం నుంచి నగర పాలక సంస్థ దళం పూర్తిగా తొలగిస్తుందని చెప్పారు.